# ప్రజా మనోజ్ఞలు

తెలంగాణ జాతీయ దినపత్రిక

ఎడిటర్ : సిహెచ్.వి. ప్రభాకర్ రావు



దేశంలోని అత్యంత ప్రమాదకరస్థితిలోని మూడు డ్యామ్‌లలో మేడిగడ్డ

వెల్లడించిన కేంద్ర జలశక్తి శాఖ

ప్రచురణ : జగిత్యాల సంపుటి : 05 సంచిక : 203 పేజీలు : 04 వెల రూ. 2 శుక్రవారం 30 - 01 - 2026

## బాధ్యులకు శిక్ష పడాల్సిందే

- కేసీఆర్ కు సిట్ నోటీసులపై మహేశ్ గౌడ్ స్పందన
- బాధ్యులకు శిక్ష పడాల్సిందేనని వ్యాఖ్య
- కేసీఆర్ పై తమకు గౌరవం ఉందన్న మహేశ్ గౌడ్
- విచారణ పారదర్శకంగా జరుగుతోందని వ్యాఖ్య
- పూర్తి స్థాయిలో విచారణ జరిగితేనే వాస్తవాలు వెలుగులోకి వస్తాయన్న మహేశ్



హైదరాబాద్ : తెలంగాణలో సంచలనం రేపిన ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కు నంది నగర్ లోని ఆయన నివాసంలో సిట్ అధికారులు నోటీసులు ఇచ్చారు. కేసీఆర్ వయసును దృష్టిలో ఉంచుకొని ఆయన కోరిన ప్రదేశంలోనే విచారిస్తామని సిట్ అధికారులు తమ నోటీసుల్లో పేర్కొన్నారు. మరోవైపు, కేసీఆర్ కు నోటీసులు ఇవ్వడంపై పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ స్పందించారు. ఈ వ్యవహారంలో పారదర్శకంగా సిట్ విచారణ జరుగుతోందని ఆయన అన్నారు. కేసీఆర్ పై తమకు ఎంతో గౌరవం ఉందని... అయితే, ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో ఎవరెవరి భాగస్వామ్యం ఉందో నిగ్గుతేలాల్సి ఉందని చెప్పారు. అప్పటి సీఎం, మంత్రుల ఆదేశాలు లేకుండా ఇంతటి భారీ స్థాయి ఉల్లంఘనలు జరిగే అవకాశమే లేదని ఆయన అన్నారు. పూర్తి స్థాయిలో సిట్ దర్యాప్తు జరిగితేనే వాస్తవాలు - మిగతా 2 లో

## ఆసియాలోనే అతిపెద్ద గిరిజన పండుగ మేడారం జాతర

- మేడారంలో మొక్కులు చెల్లించుకున్న కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, జువల్ ఓరం
- మేడారం సమ్మక్క-సారలమ్మ జాతరను సందర్శించిన కేంద్ర మంత్రులు
- గద్దెలపై నిలువెత్తు బంగారం సమర్పించి మొక్కులు చెల్లించుకున్న ఓరం, కిషన్ రెడ్డి
- గిరిజనుల మహా కుంభమేళా ఈ జాతర అని అభివర్ణించిన జువల్ ఓరం
- రూ.890 కోట్లతో సమ్మక్క-సారలమ్మ గిరిజన విశ్వవిద్యాలయం ఏర్పాటు
- గిరిజన అభివృద్ధి, సంక్షేమానికి కేంద్రం పూర్తి మద్దతు ఇస్తుందని వెల్లడి



హైదరాబాద్ : ఆసియాలోనే అతిపెద్ద గిరిజన పండుగగా ప్రసిద్ధి చెందిన మేడారం సమ్మక్క - సారలమ్మ జాతరను కేంద్ర మంత్రులు గురువారం సందర్శించారు. కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖ మంత్రి జువల్ ఓరం, బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి వనదేవతలను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రవేశ ద్వారం వద్ద వారికి రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీతక్క, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సాదర స్వాగతం పలికారు. గిరిజన డప్పు వాయిద్యాల మధ్య ఆలయంలోకి ప్రవేశించిన కేంద్ర మంత్రులు, గద్దెలపై 'నిలువెత్తు బంగారం' సమర్పించి తమ మొక్కులను చెల్లించుకున్నారు. అనంతరం జువల్ ఓరం మీడియాతో మాట్లాడుతూ, - మిగతా 2 లో



2 లో


## కేసీఆర్ కు నోటీసులు అందించిన సిట్

నేడే విచారణ

నంది నగర్ లోని నివాసంలో నోటీసులు అందించిన సిట్

విచారణకు పీఎస్ కు రావాల్సిన అవసరం లేదన్న సిట్ అధికారులు

ప్లేస్ చెబితే తామే అక్కడకు వస్తామని వెల్లడి



2 లో

## కొలంబియాలో ఘోర విమాన ప్రమాదం

ప్రముఖ నేత సహా 15 మంది మృతి

మృతుల్లో ప్రముఖ మానవ హక్కుల నేత డియోజెనెస్ క్వింటెరో

టేకాఫ్ అయిన కొద్ది నిమిషాలకే ఎయిర్ కంట్రోల్‌తో సంబంధాలు కట్

ప్రమాదంలో ఎవరూ బతకలేదని అధికారికంగా ప్రకటన

## 'తెలుగు రాష్ట్రాల్లో ద్రవ్యోల్బణం ఏటా తగ్గుతోంది

- కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్
- 2026-27 ఆర్థిక సంవత్సరంలో 6.8-7.2 శాతంగా జీడీపీ వృద్ధి అంచనా
- లోకసభలో ఆర్థిక సర్వేను ప్రవేశపెట్టిన నిర్మలా
- 2022-23 నుంచి 2025-26 వరకు ద్రవ్యోల్బణం భారీగా తగ్గినట్లు కేంద్రం పేర్కొంది
- ముఖ్యంగా తెలంగాణలో 8.61 నుంచి 0.20 శాతానికి ద్రవ్యోల్బణం
- ఆంధ్రప్రదేశ్‌లో 7.57 నుంచి 1.39 శాతానికి దిగివచ్చినట్లు వెల్లడి



ఢిల్లీ : 2026-27 ఆర్థిక సంవత్సరంలో జీడీపీ వృద్ధి రేటు 6.8 నుంచి 7.2 శాతం మధ్య ఉంటుందని కేంద్రం అంచనా వేసింది. ప్రపంచవ్యాప్తంగా అనిశ్చితులు కొనసాగుతున్నప్పటికీ 2026-2027కు భారత్‌లో స్థిరమైన వృద్ధి నమోదవుతుందని సర్వే అంచనా వేసింది. బడ్జెట్ సమావేశాల్లో భాగంగా 2025-26 ఆర్థికసర్వేను కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్ లోకసభలో ప్రవేశపెట్టారు. ఈ క్రమంలోనే కేంద్ర ఆర్థిక సర్వేలో తెలుగు రాష్ట్రాల అభివృద్ధి ప్రస్తావించారు. తెలుగు రాష్ట్రాల్లో ద్రవ్యోల్బణం ఏటా తగ్గుతూ వస్తోందని పేర్కొంది. 2022-23 నుంచి 2025-26 వరకు ద్రవ్యోల్బణం భారీగా తగ్గినట్లు కేంద్రం పేర్కొంది. ముఖ్యంగా తెలంగాణలో - మిగతా 2 లో

## ఆత్మవిశ్వాస భారత్‌కు ఈయూ ఒప్పందం నిదర్శనం

- భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ
- భారత్-ఈయూ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై ప్రధాని మోదీ కీలక వ్యాఖ్యలు
- నాణ్యతతో యూరప్ మార్కెట్లను గెలుచుకోవాలని తయారీదారులకు సూచన
- 'వికసిత్ భారత్ 2047' సాధన దిశగా ప్రభుత్వం ముందుకు వెళ్తోందని స్పష్టీకరణ
- తొమ్మిదోసారి బడ్జెట్ ప్రవేశపెట్టడంపై నిర్మలా సీతారామన్‌ను అభినందించిన మోదీ



ఢిల్లీ : బడ్జెట్ సమావేశాల ప్రారంభం సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ పార్లమెంట్ వెలుపల మీడియాతో మాట్లాడారు. భారత్-యూరోపియన్ యూనియన్ మధ్య కుదిరిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం, "ఆశావహ, ఆత్మవిశ్వాస, ఆత్మనిర్భర్ భారత్" స్ఫూర్తిని ప్రతిబింబిస్తోందని అన్నారు. 21వ శతాబ్దపు ఈ త్రైమాసికంలో భారతదేశం ప్రపంచానికి ఒక ఆశాకిరణంగా, ఆకర్షణ కేంద్రంగా మారిందని పేర్కొన్నారు. దేశ ఆర్థిక, ప్రజాస్వామ్య బలంపై ప్రపంచానికి పెరుగుతున్న విశ్వాసానికి ఇదే నిదర్శనమని తెలిపారు. ఈ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం ద్వారా భారతదేశానికి, ముఖ్యంగా యువతకు ఉజ్వల భవిష్యత్తు లభిస్తుందని మోదీ ఆశాభావం వ్యక్తం చేశారు. "భారత్, యూరప్ మధ్య ఈ చారిత్రాత్మక ఒప్పందం కుదిరినప్పుడు మన పారిశ్రామికవేత్తలు, తయారీదారులు కేవలం పన్నుల తగ్గింపు గురించే ఆలోచించకూడదు. ఇది నాణ్యతను చాటుకోవాల్సిన గొప్ప అవకాశం. ఇప్పుడు మార్కెట్ మన కోసం తెరుచుకుంది. అత్యుత్తమ నాణ్యతతో యూరప్‌లోని 27 దేశాల హృదయాలను మనం గెలుచుకోవాలి. ఇది దీర్ఘకాలంలో మనకు ఎంతో మేలు - మిగతా 2 లో

## కేజీ నుంచి పీజీ వరకు డ్రగ్-ఫ్రీ

- విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్
- సోషల్ మీడియాకు దూరంగా మైనర్లు
- విధివిధానాలు రూపొందించాలని మంత్రి లోకేశ్ ఆదేశం
- మత్తు నిర్మూలనకు ప్రభుత్వం చేపట్టిన చర్యలతో 70 శాతం సంతృప్తిగా ఉన్నారని వెల్లడి
- డీఅడిక్షన్ కేంద్రాల నిర్వహణకు కార్యాచరణ రూపొందించాలని ఆదేశం
- పిల్లలను సోషల్ మీడియాకు దూరంగా ఉంచే విషయంపై విధివిధానాలు
- కేజీ నుంచి పీజీ వరకు డ్రగ్-ఫ్రీ ఏపీ కరిక్యులమ్ అమలుకు చర్యలు
- రాష్ట్రంలో గంజాయి, డ్రగ్స్ నిర్మూలనకు కూటమి ప్రభుత్వం చేపట్టిన చర్యల పట్ల 70 శాతం మంది ప్రజలు సంతృప్తి
- మిగిలిన 30 శాతంపై కూడా దృష్టి పెట్టాలని అధికారులను లోకేశ్ ఆదేశించారు



అమరావతి : కేజీ నుంచి పీజీ వరకు డ్రగ్-ఫ్రీ ఏపీ కరిక్యులమ్ అమలుకు చర్యలు తీసుకోవాలని మంత్రి నారా లోకేశ్ ఆదేశించారు. రాష్ట్రంలో పూర్తిగా అరికట్టే వరకు అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆయన దిశానిర్దేశం చేశారు. చిన్నారులను సోషల్ మీడియాకు దూరంగా ఉంచాల్సిందేనని తేల్చి చెప్పారు. సచివాలయంలో విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ నేతృత్వంలో డ్రగ్స్, గంజాయి నియంత్రణ, సోషల్ మీడియా నియంత్రణపై మంత్రివర్గ ఉపసంఘం సభ్యులతో విడివిడిగా సమావేశమయ్యారు. రాష్ట్రంలో గంజాయి, డ్రగ్స్ నిర్మూలనకు కూటమి ప్రభుత్వం చేపట్టిన చర్యల పట్ల 70 శాతం మంది ప్రజలు సంతృప్తిగా ఉన్నారని, మిగిలిన 30 శాతంపై కూడా దృష్టి పెట్టాలని అధికారులను లోకేశ్ ఆదేశించారు. రాష్ట్రంలో గంజాయి, డ్రగ్స్ నియంత్రణకు ప్రభుత్వం చేపట్టిన కఠిన చర్యలు సత్ఫలితాలను ఇస్తున్నాయని చెప్పారు. పూర్తిగా అరికట్టే వరకు అధికారులు అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు. ఎన్జీవోల ఆధ్వర్యంలో డీ అడిక్షన్ కేంద్రాల నిర్వహణకు కార్యాచరణ - మిగతా 2 లో



2 లో

## జగన్‌కు అధికారం సూట్ కాలేదు

ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల


2027లో జగన్ పాదయాత్ర చేస్తుండడంపై షర్మిల స్పందన

ఈ యాత్ర ప్రజల కోసం కాదు అధికారం కోసమేనన్న ఏపీ కాంగ్రెస్ చీఫ్

జగన్‌లో స్వార్థం తగ్గి, ప్రజలకు సేవ చేసే గుణం పెరగాలని హితవు

అప్పటివరకు దేవుడు కరుణించడని వ్యాఖ్యలు

## ప్రజానాడి



# సంపాదకీయం

## వివక్ష వద్దంటే ఆందోళనా!

ఉన్నత విద్యాసంస్థల్లో కుల వివక్ష అంతం కావటానికీ, సమానత్వం సిద్ధించటానికీ అనుసరించాల్సిన విధానాలను సూచిస్తూ యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) విడుదల చేసిన మార్గదర్శకాలను నిరసిస్తూ ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, ఢిల్లీల్లో విద్యార్థుల ఆందోళనలు సాగుతున్నాయి. ఉత్తరప్రదేశ్‌లో బరేలీ మేజిస్ట్రేట్ అలంకార్ అగ్నిహోత్రి కొలువుకు రాజీనామా చేయగా, దాన్ని నిరాకరించిన ప్రభుత్వం ఆయనను సస్పెండ్ చేసింది. బీజేపీ నాయకులు ఒకరిద్దరు యూజీసీ తీరును నిరసిస్తూ పార్టీకి రాజీనామా చేశారు. విద్యార్థుల ఆందోళనకు ఆధిపత్య కుల సంఘాలు మద్దతు పలుకుతున్నాయి.కేంద్ర విద్యామంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని యూజీసీ ఇటువంటి మార్గదర్శకాలు జారీచేయటాన్ని బీజేపీలోని ఆధిపత్య కులాల నేతలు జీర్ణించుకోలేకపోతున్నారు. పైగా ఎస్సీ, ఎస్టీలతోపాటు ఓబీసీ వర్గాలను సైతం ఈ పరిధిలోకి తీసుకురావటం వారికి ఆగ్రహం కలిగిస్తోంది. స్వాతంత్ర్యం వచ్చి ఇన్ని దశాబ్దాలవుతున్నా కులాన్ని అంతం చేయటం సంగతలా ఉంచి, కుల వివక్షను రూపుమాపేందుకు జరిగే ప్రయత్నాలకు సైతం వ్యతిరేకత ఎదురు కావటం వర్తమాన స్థితిగతులకు అద్దం పడుతుంది. వివక్ష ఎంతగా బాధిస్తుందో, పర్యవసానాలెలా ఉంటాయో దాన్ని అనుభవించేవారికి తప్ప అన్యులకు తెలిసే అవకాశం లేదు. అందుకే కుల వివక్షయినా, లింగ వివక్షయినా అవేమంత పెద్ద విషయాలు కాదన్నట్టు వాదించేవారు కనబడతారు. చదువు సంస్కారాన్ని నేర్పుతుందనీ, జ్ఞానం పరిధి విస్తరించేకొద్దీ అందరూ కుల, మతాల పరిమితులు అధిగమిస్తారనీ సంస్కర్తలు ఆశించారు. విజ్ఞాన కేంద్రాలుగా భాసిల్లవలసిన ఉన్నత విద్యాసంస్థల్లో కులవివక్ష రూపుమాపటం సంగతలా ఉంచి, దాన్ని ప్రోత్సహించే ధోరణులు కనబడటం చేదు నిజం. యూజీసీ విడుదల చేసిన గణాంకాల ప్రకారమే ఇటీవలి కాలంలో క్యాంపస్‌లలో కుల వివక్ష పెరిగింది. మొత్తంగా అయిదేళ్లలో 704 విశ్వవిద్యాలయాల నుంచి, 1,553 కళాశాలల నుంచి 1,160 ఫిర్యాదులు అందాయి. మొత్తంగా అంతక్రితం సంవత్సరాలతో పోలిస్తే అయిదేళ్లలో ఇలాంటి ఫిర్యాదుల శాతం 118.4 శాతం పెరిగింది. విద్యాసంస్థలు మాత్రమే కాదు, ఉద్యోగాలు, ప్రమోషన్ల విషయంలో అన్యాయం జరుగుతోందని ఓబీసీ ఉద్యోగ సంఘాలు ఆరోపించటం కనబడుతూనే ఉంది. పరిస్థితి ఇలా ఉన్నప్పుడు కుల వివక్ష అవాస్తవమని వాదించటం ఆత్మవంచన.యూజీసీ తనకు తానుగా ఈ మార్గదర్శకాలు రూపొందించలేదు. హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయంలో 2016 జనవరిలో ఆత్మహత్య చేసుకున్న యువ దళిత విద్యార్థి రోహిత్ వేముల తల్లి రాధిక, 2019లో ముంబైలో పీజీ చేస్తూ ప్రాణం తీసుకున్న డాక్టర్ పాయల్ తాడ్వీ అనే ఆదివాసీ యువతి తల్లి అబేదా దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలతో ఇవి వెలువడ్డాయి. వాస్తవానికి 2012లోనే ఇలాంటివి రూపొందినా, అవి సలహాపూర్వకమైనవి మాత్రమే! ఉల్లంఘనలకు ఎటువంటి చర్యలుండాలో అందులో లేదు. వివక్ష, వేధింపులకు దీటుగా శిక్ష ఉండాలని ఆ తల్లులిద్దరూ పిటిషన్‌లో అభ్యర్థించారు. తాజా మార్గదర్శకాలు పాటించని సంస్థలను యూజీసీ ప్రోగ్రాంల నుంచి దూరం పెట్టడం, కేంద్ర గ్రాంట్లు నిలిపేయటం వంటి చర్యలున్నాయి. ఫిర్యాదుల విషయంలో ఎలా వ్యవహరించాలో నిర్దేశించారు. వివిధ స్థాయిల్లో కమిటీల ఏర్పాటును సూచించారు. ఫిర్యాదులపై వెనువెంటనే దర్యాప్తు చేయటం తప్పనిసరి చేశారు.ఈ మార్గదర్శకాల వల్ల జనరల్ క్యాటగిరీ విద్యార్థులు వేధింపులకు గురవుతారన్నది ఆందోళన చేస్తున్నవారి వాదన. బహుశా దీన్ని దృష్టిలో పెట్టుకునే కావొచ్చు... ఆర్థికంగా బలహీన వర్గాలకూ, అంగవైకల్యం ఉన్నవారికీ కూడా వివక్ష, వేధింపుల నుంచి రక్షణ కల్పించారు. ఈ మార్గదర్శకాలపై ఉన్న అపోహల్ని తొలగిస్తామనీ, ఇవి దుర్వినియోగమయ్యే అవకాశమే లేదనీ కేంద్రం చెబుతోంది. ఏదేమైనా కుల, మత, లింగ వివక్షలు ఉండరాదంటున్న రాజ్యాంగ అధికరణం 15కు ఈ మార్గదర్శకాలు అనుగుణంగానే ఉన్నాయి. వివక్ష, దాని ఆధారంగా వేధింపులు కళ్లెదుట కనబడుతుండగా ఇలాంటి నిబంధనల్ని వ్యతిరేకించటం, దుర్వినియోగమవుతుందన్న సాకు చెప్పటం ధర్మం కాదు. ఆచరణలో లోటుపాట్లుంటే చక్కదిద్దటానికి ఎప్పుడూ అవకాశం ఉంటుంది.

# కేజీ నుంచి పీజీ వరకు డ్రగ్-ఫ్రీ



మొదటిపేజీ తరువాయి – రూపొందించాలని సూచించారు. 40 వేల ఈగల్ క్లబ్స్ : ఈగల్ యాప్‌ను లీప్ యాప్‌నకు అనుసంధానించాలని దిశానిర్దేశం చేశారు. గంజాయి, డ్రగ్స్ నియంత్రణకు ఈగల్ (ఎలైట్ యాంటీ-నార్కోటిక్స్ గ్రూప్ ఫర్ లా ఎన్‌ఫోర్స్‌మెంట్) ఆధ్వర్యంలో ఇప్పటివరకు చేపట్టిన చర్యలను అధికారులు మంత్రులకు వివరించారు. ఎన్ కార్డ్ ప్రణాళికతో పూర్తిగా అనుసంధానం చేసినట్లు తెలిపారు. ప్రణాళికాబద్ధంగా గంజాయి, డ్రగ్స్ అక్రమ రవాణ నెట్‌వర్క్‌లను ధ్వంసం చేసినట్లు అధికారులు చెప్పారు. 40 వేల ఈగల్ క్లబ్స్ ఏర్పాటు చేయడంతో పాటు 35,400 అవగాహనా కార్యక్రమాల ద్వారా విద్యార్థులు, ప్రజల్లో గంజాయి, డ్రగ్స్ వల్ల కలిగే దుష్ప్రభావాలను వివరించినట్లు తెలిపారు. ఈ సమీక్షలో ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, డీజీపీ హరీశ్ కుమార్ గుప్తాతో పాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.నిర్ణీత వయసుకు లోబడిన మైనర్లను సోషల్ మీడియాకు దూరంగా ఉంచే విషయమై విధివిధానాలను రూపొందించాలని మంత్రి నారా లోకేశ్ అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. చిన్నారులపై సోషల్ మీడియా నిషేధం విధించే అంశంపై సింగపూర్, ఆస్ట్రేలియా, మలేషియా, ఫ్రాన్స్‌లో అనుసరిస్తున్న విధానాలను అధ్యయనం చేయాలని సూచించారు. ఈ విషయంపై సుప్రీంకోర్టు గైడ్ లైన్స్‌ను పరిగణలోకి తీసుకుని మార్గదర్శకాలు రూపొందించాలని అన్నారు. మలేషియాలో మై డిజిటల్ ఐడీ, పాస్ పోర్టు వివరాలతో ఈ-కేవైసీ అనుసంధానం ద్వారా 16 సంవత్సరాల పైబడిన వారికి మాత్రమే సోషల్ మీడియా యాక్సెస్ ఉందని మంత్రి నాదెండ్ల మనోహర్ మంత్రివర్గ ఉపసంఘం దృష్టికి తీసుకొచ్చారు. చిన్నారులను సోషల్ మీడియాకు దూరంగా ఉంచాలన్న విషయమై మంత్రుల బృంద సమావేశంలో ఏకాభిప్రాయం వ్యక్తమైంది. అయితే ఎంత వయోపరిమితి విధించాలనే విషయమై వివిధ దేశాల్లో చట్టాలను పరిశీలిం చాల్సిందిగా మంత్రుల బృందం అధికారులకు సూచించింది.సోషల్ మీడియాలో ఫేక్ న్యూస్ పోస్టు చేసే వారితో పాటు కులం, మతం, ప్రాంతం పేరుతో విద్వేషపూరిత వ్యాఖ్యలు చేసే హెబిచ్యువల్ అఫెండర్స్‌ను కట్టడి చేసేందుకు కఠిన చర్యలు చేపట్టాలని లోకేశ్ స్పష్టం చేశారు. దీనిపై చర్చించేందుకు సోషల్ మీడియా ప్లాట్ ఫాం కంప్లయన్స్ ఆఫీసర్లను కూడా వచ్చే జీవోఎం సమావేశానికి రప్పించాలని సూచించారు. సోషల్ మీడియాలో విద్వేషపూరిత వ్యాఖ్యలు చేసేవారిపై చర్యలు తీసుకునేందుకు సెక్షన్-46 ఐటీ యాక్ట్ ప్రకారం రాష్ట్రస్థాయి అడ్జుడికేటింగ్ ఆఫీసర్ నియామకంపై నోటిఫికేషన్ విడుదల చేయాలని సమావేశంలో నిర్ణయించారు. కేంద్రప్రభుత్వ అధీనంలోని సహయోగ్ పోర్టల్ ద్వారా కొన్ని కేసుల విషయంలో చర్యలకు ఉపక్రమిస్తున్నట్లు అధికారులు తెలిపారు. కంప్యూటర్ రిలేటెడ్ ఎఫెండర్స్, సైబర్ లా ఎఫెండర్స్ కట్టడి, సైబర్ పోలీస్ స్టేషన్ల ఏర్పాటు తదితర అంశాలపై సమావేశంలో చర్చ జరిగింది. ఈ సమావేశంలో మంత్రులు కొలుసు పార్థసారధి, వంగలపూడి అనిత, నాదెండ్ల మనోహర్, సత్యకుమార్ యాదవ్‌లు పాల్గొన్నారు. అనంతరం సచివాలయంలోని తన చాంబర్‌లో మంత్రి నారా లోకేశ్ ప్రజలను కలుసుకున్నారు. వివిధ సమస్యలపై వారి నుంచి వినతులు స్వీకరించారు. ఆయా విజ్ఞప్తులను పరిశీలించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం అందరితో కలిసి ఫొటోలు దిగారు.

# జగన్‌కు అధికారం సూట్ కాలేదు



మొదటిపేజీ తరువాయి – ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తన సోదరుడు, వైసీపీ అధినేత జగన్ పై మరోసారి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. "జగన్‌కు అధికారం సూట్ కాలేదు" అంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. అధికారం చేతిలో ఉన్నప్పుడు ఆయన అసలు నైజం బయటపడిందని, ఆయన తన స్వభావం మార్చుకోవాలని హితవు పలికారు. 2029 ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని 2027లో జగన్ చేపట్టనున్న పాదయాత్రపై ఆమె తీవ్రంగా స్పందించారు. విజయవాడలోని కాంగ్రెస్ కార్యాలయంలో గురువారం ఆమె మీడియాతో మాట్లాడారు."ఒక మనిషి నిజమైన నైజం తెలియాలంటే అతడికి అధికారం ఇచ్చి చూడాలని అబ్రహం లింకన్ అన్నారు. మనం జగన్‌కు అధికారం ఇచ్చి చూశాం. అతడి పనితీరు ఎలా ఉందో గమనించాం. జగన్‌కు అధికారం సూట్ కాలేదని అర్థమైంది" అని షర్మిల అన్నారు. జగన్‌లో స్వార్థం తగ్గి, ప్రజలకు సేవ చేసే గుణం పెరగాలని, అప్పటివరకు దేవుడు కరుణించడని, ప్రజలు కూడా ఆదరించరని ఆమె వ్యాఖ్యానించారు. 2027 జూలైలో చేపట్టే పాదయాత్ర గురించి ఇప్పుడే ఎందుకు ప్రకటించాలని షర్మిల ప్రశ్నించారు. "ఆ యాత్ర కేవలం అధికారం కోసమే తప్ప ప్రజల కోసం కాదు. మేం ఇప్పుడు ఉపాధి హామీ కూలీల కోసం యాత్ర చేస్తున్నాం. జగన్ ఎవరి కోసం, ఏ ప్రయోజనం కోసం యాత్ర చేస్తున్నారో చెప్పాలి" అని నిలదీశారు.గత ఐదేళ్ల పాలనలో జగన్ ప్రజలకు చేసిందేమిటని షర్మిల ప్రశ్నించారు. "మద్యపాన నిషేధం హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చాక నకిలీ మద్యంతో ఏరులై పారించి వేల కోట్లు సంపాదించారు. వేల ఏళ్ల నాటి రుషికొండను బోడిగుండు చేశారు. ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ప్రజల మధ్యకు ఎప్పుడైనా వచ్చారా? కనీసం సొంత పార్టీ నాయకులకైనా అపాయింట్‌మెంట్ ఇచ్చారా? కేవలం ఎన్నికలకు ముందు 'సిద్ధం' సభల పేరుతో హడావుడి చేశారు" అని తీవ్రంగా విమర్శించారు.వైఎస్సార్ ప్రారంభించిన జలయజ్ఞం ప్రాజెక్టులను ఎందుకు పూర్తి చేయలేదని, ఇచ్చిన హామీలను ఎందుకు పట్టించుకోలేదని ఆమె ప్రశ్నల వర్షం కురిపించారు. జగన్ మళ్లీ గెలవాలంటే ఆయన తన ప్రవర్తన, నైజం మార్చుకోవడమే ఏకైక మార్గమని షర్మిల స్పష్టం చేశారు.

# తెలుగు రాష్ట్రాల్లో ద్రవ్యోల్బణం ఏటా తగ్గుతోంది



మొదటిపేజీ తరువాయి – ద్రవ్యోల్బణం 8.61 నుంచి 0.20 శాతానికి పడిపోయినట్లు పేర్కొంది. అలాగే, ఆంధ్రప్రదేశ్‌లో 7.57 నుంచి 1.39 శాతానికి దిగివచ్చినట్లు వెల్లడించింది. ఆసక్తికరమైన విషయం ఏంటంటే, తెలుగు రాష్ట్రాల్లో ద్రవ్యోల్బణం జాతీయ సగటు 1.72 శాతం కంటే తక్కువ నమోదైనట్లు ఆర్థిక సర్వే స్పష్టం చేసింది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో తెలంగాణ, ఏపీలో ధాన్యం దిగుబడి తక్కువగా నమోదైనట్లు కేంద్రం పేర్కొంది. అకాల వర్షాలే ఇందుకు కారణమని చెప్పింది. కొత్త నగరాల విస్తరణలో అమరావతి గురించి ఆర్థిక సర్వేలో కేంద్రం ప్రస్తావించింది. లోక్‌సభలో ఆర్థికసర్వే ప్రవేశపెట్టిన అనంతరం సభను ఫిబ్రవరి 1వ తేదీకి వాయిదా వేశారు. తెలంగాణలో సాగు విస్తీర్ణం భారీగా పెరిగిందన్న కేంద్ర ఆర్థికసర్వే, 2014-23 మధ్య 1.31 కోట్ల ఎకరాల నుంచి 2.21 కోట్లకు ఎగబాకినట్లు స్పష్టం చేసింది. మిషన్‌కాకతీయ, కాళేశ్వరం వల్ల సాగు విస్తీర్ణం పెరిగిందని పేర్కొంది. ఐటీ, ఫైనాన్స్ సేవల్లో తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు రాష్ట్రాలదే 40 శాతం వాటాగా ఆర్థికసర్వే స్పష్టం చేసింది. ఏఐ స్టార్టప్‌లలో తెలంగాణ వాటా 7 శాతంగా ఉందని, ఈ సెగ్మెంట్‌లో 30 శాతంతో కర్ణాటక అగ్రస్థానంలో నిలిచిందని వెల్లడించింది. తయారీరంగం ఉద్యోగాల్లో తెలంగాణ 5 శాతం వాటా నమోదు చేసినట్లు పేర్కొంది. అత్యధిక వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరాల్లో 4వ స్థానంలో హైదరాబాద్ ఉన్నట్లు పేర్కొంది. 2035 నాటికి హైదరాబాద్ జీడీపి 201.4 బిలియన్ డాలర్లకు పెరిగే అవకాశం ఉంది, మున్సిపల్ బాండ్ల జారీలో హైదరాబాద్‌ది అగ్రస్థానమని వివరించింది. హైదరాబాద్, వరంగల్ మధ్య 'రీజినల్ ర్యాపిడ్ ట్రాన్సిట్ సిస్టం' ఏర్పాటుకు చేస్తే బావుంటుందని ఆర్థిక సర్వే సూచించింది.బడ్జెట్‌కు ముందు ఆర్థిక సర్వేను ప్రవేశపెట్టడం ఆనవాయితీగా వస్తోంది. ఈ సర్వేలో గత సంవత్సర కాలంలో దేశ ఆర్థిక పనితీరును, వచ్చే ఏడాదిలో ఆర్థికంగా ఎదురయ్యే సవాళ్లను ముందుగానే అంచనా వేసి ఉంటుంది. ఆర్థిక మంత్రిత్వశాఖకు చెందిన ఎకనామిక్ అఫైర్స్ డిపార్ట్‌మెంట్‌లోని ఎకనమిక్ డివిజన్ ఈ సర్వేను రూపొందిస్తుంది. తొలుత 1950-51 సంవత్సరం నుంచి ఆర్థిక సర్వేను బడ్జెట్‌తో పాటే ప్రవేశపెట్టేవారు. 1960 తర్వాత బడ్జెట్‌కు ఒక రోజు ముందు ప్రవేశపెట్టే సంప్రదాయం మొదలైంది.

# ఆసియాలోనే అతిపెద్ద గిరిజన పండుగ మేడారం జాతర



మొదటిపేజీ తరువాయి – సమ్మక్క – సారలమ్మ జాతర గిరిజనుల మహా కుంభమేళా అని అభివర్ణించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆదేశాల మేరకు, 20 ఏళ్ల తర్వాత మళ్లీ ఇక్కడికి రావడం సంతోషంగా ఉందన్నారు. గిరిజన సంక్షేమానికి కేంద్రం కట్టుబడి ఉందని, పీఎం జన్‌మన్ పథకం కింద రూ. 24,000 కోట్లు, తెలంగాణకు 23 ఏకలవ్య పాఠశాలలు కేటాయించినట్లు తెలిపారు.కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ, జాతర అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి పనిచేస్తున్నాయని చెప్పారు. ఈ ప్రాంత పర్యాటక అభివృద్ధికి రూ. 80 కోట్లు, రామప్ప ఆలయానికి రూ. 40 కోట్లు, జాతర ఏర్పాట్లకు ఈ ఏడాది రూ. 3.70 కోట్లు కేటాయించినట్లు వివరించారు. మేడారంలో సమ్మక్క – సారలమ్మ పేరుతో రూ. 890 కోట్ల వ్యయంతో సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీని ఏర్పాటు చేస్తున్నామని, ఇప్పటికే పనులు ప్రారంభమయ్యాయని వెల్లడించారు. త్వరలోనే ప్రధాని ఈ ప్రాజెక్టును లాంఛనంగా ప్రారంభిస్తారని ఆయన స్పష్టం చేశారు.

# ఏపీకి త్వరలో 750 ఎలక్ట్రిక్ బస్సులు



మొదటిపేజీ తరువాయి – వచ్చినప్పటి నుంచి రాష్ట్రవ్యాప్తంగా మహిళలు ఇప్పటివరకు సుమారు 40 కోట్ల ఉచిత ప్రయాణాలు చేసినట్లు మంత్రి తెలిపారు. ఈ పథకాన్ని ప్రభుత్వం భారంగా కాకుండా, ప్రజల పట్ల బాధ్యతగా అమలు చేస్తోందని స్పష్టం చేశారు. ఈ విజయానికి 48 వేల మంది ఆర్టీసీ సిబ్బంది కృషే ప్రధాన కారణమని ఆయన ప్రశంసించారు. రాష్ట్రంలో ప్రజారవాణా వ్యవస్థను మరింత ఆధునికీకరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. రెట్రోఫిట్మెంట్ బస్సులపై పరిశీలన కొనసాగుతోందని, అధునాతన సౌకర్యాలతో కూడిన ఎలక్ట్రిక్ బస్సులను త్వరలో అందుబాటులోకి తీసుకురాబోతున్నామని తెలిపారు. పల్లెవెలుగు సర్వీసుల్లోనూ ఏసీ సౌకర్యం ఉండేలా చర్యలు తీసుకోవాలని సీఎం చంద్రబాబు ఆదేశించారని, అందుకు అనుగుణంగా ప్రణాళికలు అమలు చేస్తున్నామని చెప్పారు.మహిళలు ఉచితంగా ప్రయాణించేలా అన్ని ప్రాంతాల్లోనూ ఏసీ బస్సులను అందుబాటులోకి తీసుకొస్తామని మంత్రి తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పరిష్కారం కాని అనేక సమస్యలను కూటమి ప్రభుత్వం దశలవారీగా పరిష్కరిస్తోందని రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. టికెట్ ఆదాయంపైనే ఆధారపడకుండా ఆర్టీసీ కార్గో సర్వీసుల ద్వారా రూ.200 కోట్ల ఆదాయం ఆర్జించిందని మంత్రి వెల్లడించారు. కార్గో ఆదాయంలో అగ్రస్థానంలో నిలిచిన జిల్లా అధికారులను ప్రశంసాపత్రాలు, నగదు పురస్కారాలతో సత్కరించారు. అనంతరం విజయవాడ బస్టాండ్‌లోని కార్గో సర్వీసు నూతన భవనాన్ని మంత్రి ప్రారంభించారు.

# బాధ్యులకు శిక్ష పడాల్సిందే

మొదటిపేజీ తరువాయి – వెలుగులోకి వస్తాయని తెలిపారు. దర్యాప్తులో భాగంగా ఎవరికైనా నోటీసులు ఇచ్చే అధికారం సిట్ కు ఉందని... కేసీఆర్‌కు నోటీసుల విషయంలో ఎలాంటి రాజకీయ దురుద్దేశం లేదని చెప్పారు. బాధ్యులు ఎవరైనా శిక్ష అనుభవించాల్సిందేనని అన్నారు.

# కేసీఆర్ కు నోటీసులు అందించిన సిట్



మొదటిపేజీ తరువాయి – తెలంగాణ రాజకీయాల్లో ప్రకంపనలు పుట్టిస్తున్న ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ కు నోటీసులు అందాయి. హైదరాబాద్ లోని నందినగర్ లో ఉన్న కేసీఆర్ నివాసానికి వెళ్లిన సిట్ అధికారులు నోటీసులు అందించారు. రేపు మధ్యాహ్నం 3 గంటలకు విచారణ జరుపుతామని నోటీసుల్లో సిట్ అధికారులు పేర్కొన్నారు. కేసీఆర్ వయసు దృష్ట్యా విచారణ కోసం పోలీస్ స్టేషన్ కు రావాల్సిన అవసరం లేదని సిట్ తెలిపింది. హైదరాబాద్ నగర పరిధిలోని ఏదైనా ప్రాంతం వివరాలను తెలిపితే... అక్కడకే వచ్చి విచారణ జరుపుతామని పేర్కొంది. ఇప్పటికే ఈ కేసులో కేటీఆర్, హరీశ్ రావు, సంతోష్ కుమార్ లను సిట్ విచారించింది. మళ్లీ అవసరమైతే విచారణకు పిలుస్తామని వారికి తెలియజేసింది. ఇప్పుడు గులాబీ బాస్ ను విచారణకు పిలవడంతో ఆ పార్టీలో ఉత్కంఠ నెలకొంది. రాబోయే రోజుల్లో ఈ కేసులో మరెన్ని మలుపులు చోటుచేసుకుంటాయో అనే ఆసక్తి సర్వత్ర నెలకొంది.

# ఆత్మవిశ్వాస భారత్‌కు ఈయూ ఒప్పందం నిదర్శనం



మొదటిపేజీ తరువాయి – చేస్తుంది" అని ప్రధాని వివరించారు. ఈ ఒప్పందం ద్వారా భారత రైతులు, యువత, సేవల రంగంలోని నిపుణులకు ప్రపంచ మార్కెట్లలో గణనీయమైన అవకాశాలు లభిస్తాయని విశ్వాసం వ్యక్తం చేశారు.2047 నాటికి 'వికసిత్ భారత్' సాధించాలనే సంకల్పంలో ఈ బడ్జెట్ సమావేశాలు ఒక ముఖ్యమైన అడుగు అని ప్రధాని పేర్కొన్నారు. తమ ప్రభుత్వం 'రిఫార్మ్ ఎక్స్‌ప్రెస్'పై వేగంగా ముందుకు సాగుతోందని, దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలకు శాశ్వత పరిష్కారాలు చూపుతోందని తెలిపారు. తమ ప్రభుత్వ పనితీరు "సంస్కరణ, పనితీరు, పరివర్తన" అనే సూత్రంపై ఆధారపడి ఉంటుందని స్పష్టం చేశారు. టెక్నాలజీని అందిపుచ్చుకుంటూనే, మానవతా దృక్పథాన్ని విస్మరించబోమని, చిట్టచివరి వ్యక్తి వరకు లబ్ధి చేకూరేలా చూస్తామని హామీ ఇచ్చారు.అలాగే, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వరుసగా తొమ్మిదోసారి బడ్జెట్ ప్రవేశపెట్టడం దేశ పార్లమెంటరీ చరిత్రలో ఒక గర్వకారణమైన క్షణమని అభివర్ణించారు. అంతకుముందు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పార్లమెంటులో చేసిన ప్రసంగం 140 కోట్ల మంది భారతీయుల ఆత్మవిశ్వాసాన్ని, ఆకాంక్షలను ప్రతిబింబించిందని కొనియాడారు. దేశాభివృద్ధిని వేగవంతం చేసేందుకు ఎంపీలందరూ నిర్మాణాత్మక చర్చల్లో పాల్గొనాలని ప్రధాని కోరారు.

# కొలంబియాలో ఘోర విమాన ప్రమాదం



మొదటిపేజీ తరువాయి – కొలంబియాలో ఘోర విమాన ప్రమాదం చోటుచేసుకుంది. దేశ ఈశాన్య ప్రాంతంలోని నార్టే డి సెంటాండర్ ప్రావిన్స్‌లో ప్రభుత్వ రంగ విమానయాన సంస్థ సటెనాకు చెందిన ఒక చిన్న విమానం బుధవారం కుప్పకూలింది. ఈ దుర్ఘటనలో విమానంలో ప్రయాణిస్తున్న ఇద్దరు సిబ్బంది, 13 మంది ప్రయాణికులతో సహా మొత్తం 15 మంది అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో ప్రముఖ రాజకీయ నాయకుడు, మానవ హక్కుల కార్యకర్త డియోజెనెస్ క్వింటెరో కూడా ఉండటంతో దేశవ్యాప్తంగా విషాద ఛాయలు అలుముకున్నాయి.ఎఖ4709 రిజిస్ట్రేషన్ నంబర్ గల ఈ విమానం, స్థానిక కాలమానం ప్రకారం ఉదయం 11:42 గంటలకు కుకుటా విమానాశ్రయం నుంచి ఒకాన్యాకు బయలుదేరింది. 40 నిమిషాల ఈ ప్రయాణం ప్రారంభమైన కొద్దిసేపటికే ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్‌తో విమానానికి సంబంధాలు పూర్తిగా తెగిపోయాయి. అప్రమత్తమైన అధికారులు కురాసికా అనే మారుమూల గ్రామీణ ప్రాంతంలో విమానం కూలిపోయినట్లు గుర్తించారు. వెంటనే రెస్క్యూ బృందాలు ఘటనా స్థలానికి చేరుకున్నాయి.విమానం ఉన్న ప్రదేశాన్ని గుర్తించిన తర్వాత అందులో ఎవరూ ప్రాణాలతో మిగిలిలేరని అధికారులు ధ్రువీకరించినట్లు కొలంబియా రవాణా మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో పేర్కొంది. ఈ విషాద ఘటనపై కొలంబియా అధ్యక్షుడు గుస్తావో పెట్రో తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. "ఈ మరణాలు నన్ను తీవ్రంగా కలచివేశాయి. వారి కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను" అని సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ప్రస్తుతం అధికారులు ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నారు.

# శ్రీ వెంకటేశ్వర స్వామి వారికి నిలువెత్తు బెల్లంతో తులాభారం సమర్పించిన ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్

**రాయికల్ జనవరి 29 (ప్రజా మంటలు) :** పట్టణంలో శ్రీ వెంకటేశ్వర ఆలయంలో వెంకటేశ్వర స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ ఈ సందర్భంగా రాయికల్ మున్సిపల్ మాజీ కోఆప్షన్ సభ్యులు మహేంద్ర బాబు గారు జగిత్యాల ఎమ్మెల్యేగా డాక్టర్ సంజయ్ కుమార్ 2023లో గెలుపొందాలని వెంకటేశ్వర స్వామి వారిని మొక్కుకోగా ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్ గారు నిలువెత్తు బెల్లం జోకి తులాభారం సమర్పించి మొక్కు తీర్చుకున్నారు.ఎమ్మెల్యే మాట్లాడుతూ రాయికల్ పట్టణ అభివృద్ధి కి నిరంతరం కృషి చేస్తా... ముఖ్యమంత్రి 5కోట్ల ఎస్ డి ఎఫ్ నిధులు మంజూరు చేయటం జరిగింది..రాయికల్ పట్టణ అభివృద్ధి కి నిధులు కేటాయిస్తా.. రాయికల్ పట్టణ వెంకటేశ్వర స్వామి ఆలయ అభివృద్ధి కి నిధులు



మంజూరు చేస్తా..రాయికల్ పట్టణంలో హనుమాన్ ఆలయం,గుడి కోట ఆలయ అభివృద్ధి కి నిధులు మంజూరు చేయటం జరిగిందన్నారు.రాయికల్ పట్టణ అభివృద్ధి కి 15 కోట్లు మంజూరు చేయగా ఇటీవల మంత్రితో కలిసి 7 కోట్ల 20 లక్షల అభివృద్ధి పనులకు భూమిపూజ చేయటం జరిగింది.మరొక 7 కోట్ల 80 లక్షలతో అతిత్వరలో అభివృద్ధి పనులకు భూమిపూజ చేస్తాం అన్నారు.అన్నివర్గాల ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండి అన్ని వర్గాల సంక్షేమం అభివృద్ధి కోసం కృషి చేస్తా అన్నారు.మన మతాన్ని ప్రేమిస్తూ ఇతర మతాలను గౌరవించాలి అన్నారు ఎమ్మెల్యే. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ మోర హనుమండ్లు మాజీ వైస్ చైర్మన్ గండ్ర రమాదేవి అచ్యుత రావు పడిగల రవీందర్ రెడ్డి కోల శ్రీనివాస్ శ్రీనివాస్ గౌడ్ ఆలయ ఛైర్మన్ గంగాధర్ మహేంద్ర బాబు మోర రామ్మూర్తి రాయికల్ పట్టణ మండల నాయకులు ఆలయ కమిటీ సభ్యులు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# నిలువెత్తు బంగారం సమర్పించిన మంత్రి పొన్నం ప్రభాకర్

**సమ్మక్క, సారలమ్మ జాతరలో మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేక పూజలు**

**అమ్మవార్లు గద్దెకు వచ్చే సమయంలో ఫైరింగ్ పునరుద్ధరణపై హామీ**





**భీమదేవరపల్లి (ప్రత్యేక ప్రతినిధి కాశిరెడ్డి ఆదిరెడ్డి కథనం) :** మండలంలోని ముల్కనూర్ సమ్మక్క, సారలమ్మ జాతర సందర్భంగా రాష్ట్ర మంత్రి గురువారం అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవార్లకు నిలువెత్తు బంగారం సమర్పించి భక్తిశ్రద్ధలు వ్యక్తం చేశారు. జాతరకు తరలివచ్చిన లక్షలాది భక్తులతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. అమ్మవార్లు గద్దెకు వచ్చే పవిత్ర సమయంలో గతంలో ఆనవాయితీగా



నిర్వహించిన ఫైరింగ్ సంప్రదాయం ఉన్నదని స్థానికులు మంత్రికి వివరించారు. ఈ అంశంపై సంబంధిత అధికారులతో చర్చించి, భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా సంప్రదాయాల పునరుద్ధరణకు చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. గత 44 సంవత్సరాలుగా కొనసాగుతున్న సాంప్రదాయాలకు ప్రభుత్వం పూర్తి గౌరవం ఇస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జాతర కమిటీ అధ్యక్షుడు జక్కుల ఐలయ్య, మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ జాలి ప్రమోద్ రెడ్డి, ఉప సర్పంచ్ కాస్తగోని మమతా బాలకృష్ణ, కార్యదర్శి జంగం పూర్ణచందర్, సీఐ పులి రమేష్, ఎస్ఐలు రాజు, దివ్య, ప్రవీణ్ కుమార్, డైరెక్టర్లు జయపాల్, గీకురు ఐలయ్య, మాదుగుల యాదగిరి, కొదురుపాక శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. జాతర నిర్వహణలో భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని, శాంతి భద్రతల పరిరక్షణకు పోలీసు యంత్రాంగం అప్రమత్తంగా వ్యవహరించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. భక్తుల విశ్వాసం, సంప్రదాయాల పరిరక్షణే ప్రభుత్వ లక్ష్యమని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.

# ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు అప్రమత్తంగా ఉండాలి

**ఎన్నికల నియమావళి అమలులో ఉన్నందున 50 వేల లోపు నగదు మాత్రమే అనుమతి**

**జిల్లా ఎన్నికల అధికారి మరియు జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్**

**జగిత్యాల జనవరి 29 ( ప్రజా మంటలు) :** కలెక్టరేట్ ఆడిటోరియంలో ఎన్నికల విధులకు సంబంధించి ఫ్లయింగ్ స్క్వాడ్, ఎస్.ఎస్.టి,ఎఫ్.ఎస్.టి, జోనల్ అధికారులు మరియు అసిస్టెంట్ ఎక్స్పెండిచర్ అబ్జర్వర్ ల తో అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ ఎన్నికల నియమావళి ప్రకారం గ్రామ ప్రజలు 50 వేల లోపు నగదు మాత్రమే అనుమతి ఉన్నదని, 50 వేలకు పైబడి ఉన్న నగదు కు సంబంధిత పత్రాలు చూపించాల్సి ఉంటుందని తెలిపారు. ఎన్నికల సమయంలో ఎవరు ఏమి చేయాలి, ఏమి చేయకూడదు, స్పెషల్ టీమ్‌ల పాత్ర ఎలా ఉంటుందనే విషయాలపై వివరించారు. ఎన్నికలు నిష్పక్షికంగా నిర్వహించడంలో ఈ బృందాల పాత్ర కీలకంగా ఉంటుందన్నారు. జోనల్ అ అధికారులకు మేజిస్ట్రేట్ పవర్ అధికారాలు ఉంటాయని, వారికి వచ్చే సమాచారం, పౌరులు చేసే ఫిర్యాదుల ఆధారంగా వీరి కార్యాచరణ ఉండాలని తెలిపారు. ఎన్నికల సందర్భంగా ఆయా పార్టీల నాయకులు పెట్టే ప్రలోభాలు, ఇచ్చే బహుమతులు, పంచే డబ్బులు, మద్యం వంటి వాటిపై కూడా ఈ ప్రత్యేక ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు దృష్టిసారించాలని సూచించారు. రెండవ సాధారణ మున్సిపల్ ఎన్నికల పోలింగ్ కేంద్రాలు, బూత్‌లు, ఎన్నికల ఏర్పాట్లు, ప్రక్రియను వీరు పరిశీలిస్తారని, అవసరమైతే స్థానిక అధికారులకు సలహాలు,




సూచనలు, ఆదేశాలు ఇస్తారని పేర్కొన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్‌ల విధి నిర్వహణ ఎప్పటికప్పుడు కెమెరాలో రికార్డు అవుతుందని, ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నుంచి మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలులోకి వచ్చిందని ఎం.సి.సి లోజోనల్ అధికారులు, ఎఫ్.ఎస్.టి, ఎస్.ఎస్.టిలు మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ ఉల్లఘించిన వారిపై తీసుకున్న చర్యలపై రోజువారీ నివేదిక అందించేలా సిబ్బందికి సూచనలు చేశారు.ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు అప్రమత్తంగా ఉండాలని, వారిని జి.పి.ఎస్ ట్రాక్ సిస్టం ద్వారా నిరంతరాయంగా పరిశీలిస్తామని తెలిపారు. ఎటువంటి సంఘటనలు జరిగినా సీసీ కెమెరాల ద్వారా పర్యవేక్షిస్తామని తెలిపారు. ఎన్నికల నిర్వహణలో ఎన్నికల నిర్వహణలో భాగంగా మద్యం, లిక్కర్ తదితర వస్తువులు పట్టుబడ్డ సమయంలో ఫ్లయింగ్ స్క్వాడ్, సర్వేలెన్స్ వీడియో రికార్డ్ తప్పనిసరిగా చేయాలి తెలిపారు. రాజకీయ పార్టీల మీటింగ్స్, బ్యానర్లు మొదలైన సామాగ్రి పై వీడియో సర్వేలెన్స్ టీమ్‌లు రికార్డు చేయాలని తెలిపారు. ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్ లు సీజ్ చేసిన నగదును పోలీసులకు సమర్పించాలని, ఎఫ్.ఐ.ఆర్ నమోదు కాని నగదును డిస్ట్రిక్ట్ గ్రీవెన్స్ సెల్ కు సమర్పించాలని తెలిపారు. ఈ సెల్ తగిన ఆధారాలను పరిశీలించి నేరారోపణ లేకపోతే ఆ నగదు ను సంబంధిత వ్యక్తులకు అందజేస్తారు. ఏ రకంగాను ప్రజలను ప్రలోభాలకు గురి చేయకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. అనుమతి లేని నగదు ఉంది అన్న సమాచారం అందిన వెంటనే ఇన్ కం ట్యాక్స్ అధికారులకు సమాచారం అందించాలని తెలిపారు. ప్రభుత్వ వాహనాలను కూడా చెక్ చేసే అధికారం ఉన్నదని తెలిపారు. ఎలాంటి సమస్యలు ఎదురైనా కలెక్టరేట్ లో 24/7 పని చేసే కంట్రోల్ రూమ్ అందుబాటులో ఉందని అలాగే ఎలాంటి సమస్యలు ఎదురైనా కంట్రోల్ రూమ్ నెంబర్ 9666234383 ను సంప్రదించాలని సూచించారు. అందరు అధికారులు సమన్వయం తో తమకు అప్పగించిన ఎన్నికల విధులు తమకు అప్పగించిన మేరకు నిర్వర్తించాలని ఆదేశించారు.అనంతరం లోకల్ బాడీస్ అదనపు కలెక్టర్ బి. రాజ గౌడ్, ఎక్స్పెండీచర్ అబ్జర్వర్ డి. శ్రీనివాస్ లు మాట్లాడుతూ జోనల్ అధికారులకు, ఎఫ్ ఎస్ టి, ఎస్ ఎస్ ఎస్ టి మరియు అసిస్టెంట్ ఎక్స్పెండిచర్స్ అబ్జర్వర్స్ లకు క్షేత్ర స్థాయిలో ఎదురయ్యే అంశాల పైన పలు సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో లోకల్ బాడీస్ అదనపు కలెక్టర్ బి. రాజ గౌడ్, ఎక్స్పెండీచర్ అబ్జర్వర్ డి. శ్రీనివాస్, జిల్లా నోడల్ అధికారులు మనోజ్ కుమార్, వి. భాస్కర్, పి. నరేష్, రవి కుమార్, శ్రీనివాస్ గౌడ్, జిల్లా ఎన్నికల విభాగం, సంబంధిత అధికారులు మరియు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ రాజకీయ కూటమి ఏర్పాటు

**స్థానిక ఎన్నికల నుంచి కలిసే బరిలోకి**

**జనరల్ సెక్రటరీ కపిలవాయి దిలీప్ కుమార్**

**సికింద్రాబాద్, జనవరి 29 (ప్రజా మంటలు) :** భావసారూప్యత కలిగిన ఎన్నికల కమిషన్ గుర్తింపు కలిగిన తొమ్మిది రాజకీయ పార్టీలు కలిసి తెలంగాణ రాజకీయ కూటమిగా ఏర్పడ్డాయని కూటమి సెక్రటరీ జనరల్ కపిలవాయి దిలీప్ కుమార్ తెలిపారు. కవాడిగూడ ఆర్ఎల్‌డీ కార్యాలయంలో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... బీఆర్ఎస్, కాంగ్రెస్ రెండూ అవినీతి పార్టీలేనని విమర్శించారు. తెలంగాణలో బీజేపీ బలహీనపడిందన్నారు.'బహుజనులకే రాజ్యాధికారం మేమెంతో మాకంత' నినాదంతో రాబోయే స్థానిక సంస్థలు, అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో కూటమిగా పోటీ చేస్తామని వెల్లడించారు. సింగరేణి అవినీతికి కేంద్రంగా మారిందని ఆరోపిస్తూ సంస్థను మూసివేయాలని డిమాండ్ చేశారు. మైనింగ్ కొనసాగించాలంటే 51 శాతం వాటా కార్మికులకు, 25 శాతం రాష్ట్ర ప్రభుత్వానికి, 24 శాతం కేంద్ర ప్రభుత్వానికి ఇవ్వాలన్న విధాన నిర్ణయం అవసరమన్నారు. కూటమి వర్కింగ్ ప్రెసిడెంట్ తీగల ప్రదీప్ గౌడ్ మాట్లాడుతూ.. స్థానిక ఎన్నికల్లో కూటమికి విజయావకాశాలు మెండుగా ఉన్నాయని చెప్పారు. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో మరిన్ని పార్టీలను కలుపుకొని బలంగా పోటీ చేస్తామని తెలిపారు.కూటమి అధ్యక్షుడు ప్రొఫెసర్ గాలి వినోద్ కుమార్ మాట్లాడుతూ ...తెలంగాణలో నిధులు, నీళ్లు, నియామకాలు దళితబహుజనులకు దక్కలేదని విమర్శించారు. రాష్ట్రంలో 28 లక్షల నిరుద్యోగులు ఉన్నా ఇప్పటివరకు కల్పించిన ఉద్యోగాలు తక్కువేనన్నారు. యువతను రాజకీయాల్లోకి తీసుకొచ్చి సంఘటితంగా పోరాడతామని




తెలిపారు.ఈ సమావేశంలో వివిధ పార్టీల నాయకులు రమావత్ లాలూ నాయక్,డేవిడ్ ఆంధ్రూ,ఈద శేషగిరి రావు, నారగోని తదితరులు పాల్గొన్నారు.

# నామినేషన్ ప్రక్రియ పగడ్బంధీ గా నిర్వహించాలి

**నామినేషన్ల కేంద్రాన్ని పరిశీలించిన**

**జిల్లా ఎన్నికల అధికారి మరియు జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్**



**జగిత్యాల జనవరి 29 (ప్రజా మంటలు) :** మున్సిపల్ ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో జగిత్యాల మున్సిపల్ పరిధిలో ఎన్నికల నామినేషన్ కేంద్రాన్ని జిల్లా ఎన్నికల అధికారి మరియు జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ పరిశీలించారు.ఈ సందర్భంగా నామినేషన్ స్వీకరణకు చేసిన ఏర్పాట్లు గమనించి పలు సూచనలు చేశారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నామినేషన్ ప్రక్రియ సజావుగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఎలాంటి పొరపాట్లు జరగకుండా నామినేషన్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. నోటిఫికేషన్ ప్రక్రియ లో భాగంగా నోటిస్ బోర్డుపై ప్రదర్శించిన విధానాన్ని పరిశీలించారు. నామినేషన్ స్వీకరణ సమయంలో ఆర్వో, ఏ ఆర్వో ల విధులను క్షుణ్ణంగా వివరించారు. అభ్యర్థులకు అవసరమైన సహకారం అందించాలని సూచించారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను తు.చ తప్పకుండా పాటిస్తూ, ప్రశాంత వాతావరణంలో ఎన్నికల ప్రక్రియను నిర్వహించాలని అన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి పక్కాగా అమలయ్యేలా చూడాలన్నారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఎలాంటి సందేహాలు ఉన్నా పై అధికారులను సంప్రదించాలని సూచించారు. అధికారులు అందరిని సమన్వయం చేసుకుంటూ తమ విధులు జాగ్రత్తగా నిర్వహించాలని అన్నారు.ఈ కార్యక్రమం లో ఆర్డీవో మధుసూదన్, డిపివో మదన్ మోహన్, మున్సిపల్ కమిషనర్ స్పందన, తహసీల్దార్ రాం మోహన్ రావు సంబంధిత అధికారులు మరియు తదితరులు పాల్గొన్నారు.

# రేవంత్ రెడ్డి విచారణ పేరిట అధికార దుర్వినియోగం

**ఆరు గ్యారెంటీల అమలుపై మాత్రం శ్రద్ధ లేదు దావ వసంత సురేష్**

**జగిత్యాల, జనవరి 29 (ప్రజా మంటలు) :** తెలంగాణ రాష్ట్ర సాధకుడు, తెలంగాణ జాతి పిత కేసీఆర్‌కు సిట్ నోటీసులు జారీ చేయడాన్ని జిల్లా తొలి జడ్పీ చైర్పర్సన్ దావ వసంత సురేష్ తీవ్రంగా ఖండించారు. విచారణల పేరుతో అధికారాన్ని దుర్వినియోగం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం, ఎన్నికల హామీలుగా ప్రకటించిన ఆరు గ్యారెంటీల అమలుపై మాత్రం పూర్తిగా విఫలమైందని ఆమె విమర్శించారు.




స్వరాష్ట్ర స్వప్నాన్ని సాకారం చేసి, దశాబ్ద కాలం పాటు తెలంగాణను దేశంలోనే అగ్రగామిగా నిలిపిన చరిత్రాత్మక నాయకుడు కేసీఆర్‌పై బురద చల్లాలనే ఉద్దేశంతోనే సిట్ నోటీసులు ఇచ్చారని ఆరోపించారు. ఇది పూర్తిగా డైవర్షన్ రాజకీయాల్లో భాగమని, మున్సిపల్ ఎన్నికల్లో రాజకీయ లబ్ధి పొందాలనే ప్రయత్నంగా ఆమె పేర్కొన్నారు.కేసీఆర్ ప్రతిష్టను దిగజార్చాలని ఎంత ప్రయత్నించినా, ఆయన గౌరవం ప్రజల్లో మరింత పెరుగుతుందన్నారు. ప్రజలన్నీ గమనిస్తున్నాయని, యావత్ తెలంగాణ రాష్ట్రం కేసీఆర్ వైపే నిలిచిందని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తే, త్వరలోనే తగిన బుద్ధి చెబుతారని దావ వసంత సురేష్ హెచ్చరించారు.

## చందు సుబ్బారావు మృతి పట్ల తీవ్ర బి.ఎస్. రాములు సంతాపం



చందు సుబ్బారావు

**హైదరాబాద్, జనవరి 29 (ప్రజా మంటలు) :** అభ్యుదయ సాహితీవేత్త, మార్క్సిస్టు రచయిత, అరసం ప్రముఖుడు ఆచార్య చందు సుబ్బారావు గురువారం ఉదయం విశాఖపట్నంలో మృతి చెందారు. ఆయన మృతి తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని అరసం నేతలు తెలిపారు.ఆంధ్ర విశ్వవిద్యాలయం ప్రొఫెసర్‌గా, సాహిత్య విమర్శకుడిగా, నవలాకారుడిగా చందు సుబ్బారావు అభ్యుదయ సాహిత్య ఉద్యమానికి ఎనలేని సేవలందించారు. స్త్రీవాదం, రాజకీయాలు, శాస్త్రీయ అంశాలపై అనేక రచనలు చేశారు.అభ్యుదయ సాహిత్య ఉద్యమంలో ఆయన పాత్ర చిరస్మరణీయమని బి.ఎస్. రాములు సంతాపం ప్రకటించారు.

## జాతరలో భక్తుల కోసం ప్రథమ చికిత్స వైద్య శిబిరం ఏర్పాటు

**జాతరలో 24 గంటల వైద్య సేవలు - డా. రెహమాన్**



**భీమదేవరపల్లి, జనవరి 29 (ప్రజా మంటలు) :** మండలంలోని ముల్కనూర్ సమ్మక్క, సారలమ్మ జాతర సందర్భంగా విచ్చేసిన భక్తుల ఆరోగ్య భద్రతను దృష్టిలో ఉంచుకుని వంగర పిహెచ్సి ఆధ్వర్యంలో ప్రథమ చికిత్స వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. జాతర ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో అత్యవసర మందులు, టిటి ఇంజెక్షన్లు, ఏఆర్వీ ఇంజెక్షన్లు భక్తులకు అందుబాటులో ఉంచారు. అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు 108 అంబులెన్స్ వాహనాన్ని కూడా శిబిరం వద్ద సిద్ధంగా ఉంచారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా 24 గంటల పాటు మూడు షిఫ్ట్‌లలో వైద్య సిబ్బంది విధులు నిర్వహించేలా ఏర్పాట్లు చేశారు. డా. జ్యోత్స్న, డా. రహ్మాన్‌లతో పాటు ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు విధుల్లో పాల్గొని భక్తులకు వైద్య సేవలు అందిస్తున్నారు.

## గొల్లపల్లి మోడల్ స్కూల్లో 6 వ తరగతి నుండి 10 వ తరగతి ప్రవేశాల కోసం దరఖాస్తుల స్వీకరణ

**గొల్లపల్లి జనవరి 29 ప్రజా మంటలు :** గొల్లపల్లి మండల లోని ఆదర్శ పాఠశాలకు దరఖాస్తుల స్వీకరణ 28/1 ముగింపు..28/02 పరీక్ష తేదీ 29/04/ ఉదయం 6వ తరగతిలో 100 సీట్లు గాను..మధ్యాహ్నం 7,8,9, 10 మిగిలిన సీట్లకు ప్రవేశ పరీక్ష ఆన్లైన్లో అప్లై చేయాలి.వివరాలకు మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ రవిశంకర్ ను సంప్రదించాలని ఒక ప్రకటనలో తెలియజేశారు.

## మొక్కలు చెల్లించుకున్న వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సుకినే సంతాజి





**ఎల్కతుర్తి జనవరి 29 ప్రజా మంటలు :** ఆదివాసుల ఆరాధ్య దైవమైన వనదేవతలు సమ్మక్క సారలమ్మను దర్శించుకుని నిలువెత్తు బంగారంతో మొక్కులు చెల్లించిన ఎల్కతుర్తి మండల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సుకినే సంతాజి హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముల్కనూరు గ్రామంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. చైర్మన్ సంతాజి మాట్లాడుతూ, హుస్నాబాద్ నియోజకవర్గం ప్రజలతో పాటు రాష్ట్ర ప్రజలంతా వనదేవతల ఆశీర్వాదాలతో చల్లగా సుఖ సంతోషాలతో ఉండాలని వనదేవతల కృపతో ప్రజల జీవితాల్లో శాంతి సుభిక్షత సమృద్ధి కలగాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో ఎల్కతుర్తి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎలిగేటి ఇంద్రసేనారెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బొల్లెపోగు డాక్టర్ రమేష్ బాబు, సింగిల్ విండో మాజీ డైరెక్టర్ ముప్పు మహేందర్, ముల్కనూర్ సర్పంచ్ ప్రమోద్ రెడ్డి,ఆ దరి రవీందర్, గాంధీనగర్ సర్పంచ్ కేతిరి లక్ష్మారెడ్డి, బావు పేట బత్తిని రవీందర్ గౌడ్, పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

## మైనర్ బాలికపై అత్యాచారం వృద్ధుని పై (పిఓసిఎస్ఓ) సెక్షన్ల కేసు నమోదు

**గొల్లపల్లి జనవరి 28 ప్రజా మంటలు :** బుగ్గారం మండలానికి చెందిన 59 సం.వ్యక్తి అదే గ్రామానికి చెందిన 07 సం. బాలిక పై అత్యాచారం చేయగా బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు నింధితుడు పై (పిఓసిఎస్ఓ) చట్టం క్రింద కేసు నమోదు కేసుకు పూర్తి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ, సతీష్ తెలిపారు.

## అక్రిడిటేషన్ ఉంటేనే వాహనాలపై "ప్రెస్" స్టిక్కర్

**ఇన్చార్జి డి పి ఆర్ ఓ పి.నరేష్**



**జగిత్యాల 29 (ప్రజా మంటలు) :** సమాచార పౌరసంబంధాల శాఖ నుంచి అధికారికంగా అక్రిడేటేషన్ కార్డులు పొందిన జర్నలిస్టులు మాత్రమే తమ వాహనాలపై 'ప్రెస్' అని రాసుకోవాలని లేదా స్టిక్కర్లు వేసుకోవడాలని డీపీఆర్వో పల్లికొండ నరేష్ తెలిపారు. అక్రిడిటేషన్ లేని వ్యక్తులు వాహనాల పై 'ప్రెస్' అని రాసుకోవడం మోటారు వాహన చట్టానికి విరుద్ధమన్నారు. ఈ మేరకు రాష్ట్ర సమాచార పౌరసంబంధాల శాఖ కమిషనర్ ప్రి యాంక ఆదేశాలు జారీ చేసినట్లు వెల్లడించారు. నిబంధనలు ఉల్లంఘించేవారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. వాహనాలపై అనధికారికంగా 'ప్రెస్' స్టిక్కర్లు వేసుకున్నవారిని గుర్తించేందుకు తనిఖీలు చేస్తామని తెలిపారు.

## కోరుట్లమెట్పల్లి నామినేషన్ కేంద్రాల పరిశీలించిన అదనపు కలెక్టర్ రాజ గౌడ్



**కోరుట్ల/మెట్పల్లి, జనవరి 29 (ప్రజా మంటలు) :** కోరుట్ల, మెట్పల్లి మున్సిపాలిటీల్లో జరుగుతున్న నామినేషన్ ప్రక్రియను జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) బి. రాజ గౌడ్ గురువారం పరిశీలించారు. నామినేషన్లు పారదర్శకంగా, సజావుగా సాగాలని సూచించారు.అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఫారాలు అందుబాటులో ఉంచాలని, ప్రతి కేంద్రంలో హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఎన్నికల నిబంధనలు ఖచ్చితంగా అమలు చేస్తూ శాంతియుత వాతావరణంలో నామినేషన్ ప్రక్రియ పూర్తిచేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో కోరుట్ల మున్సిపల్ కమిషనర్ రవీందర్, మెట్పల్లి మున్సిపల్ కమిషనర్ మోహన్, కోరుట్ల ఎమ్మార్వో కృష్ణ చైతన్య, రిటర్నింగ్ అధికారులు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికలు - నామినేషన్ వేసే ముందు ఈ విషయాలు తెలుసుకోవడం మస్ట్!

**పురపాలికల ఎన్నికల నామపత్రాల స్వీకరణ ప్రారంభం**

**దాఖలు చేసే అభ్యర్థులు ఎన్నికల సంఘం**

**నిబంధనలను తప్పనిసరి**

**బీ-ఫాం లేనిపక్షంలో నామినేషన్ తిరస్కరణ**




తెలంగాణ రాష్ట్రంలో రెండు రోజుల క్రితమే మున్సిపల్ ఎన్నికల షెడ్యూలు విడుదలైంది. దీంతో రాష్ట్రంలో రాజకీయ వేడిరాజుకుంది. నిన్నటి(బుధవారం) నుంచే ఎన్నికల నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ షురూ అయింది. ఈ ప్రక్రియ శుక్రవారం వరకు కొనసాగతుంది. నామపత్రాలను దాఖలు చేసే అభ్యర్థులు ఎలక్షన్ కమిషన్ నిబంధనలను తప్పనిసరిగా తెలుసుకుని పాటించాల్సి ఉంటుంది. లేని పక్షంలో అవి తిరస్కరణకు గురయ్యేందుకు అవకాశం ఉంది. పురపాలక ఎన్నికల ప్రక్రియ మరో 15 రోజులు కొనసాగనుంది. ఎన్నికల్లో నామినేషన్ వేసేందుకు కావాల్సిన అర్హతలు, కావాల్సిన పత్రాలు, నిబంధనలు తదితర వివరాలు మీకోసం.

**పోటీచేయాలంటే అర్హతలివే :**

పురపాలక ఎన్నికల్లో పోటీ చేయాలంటే కింది అర్హతలు కలిగి ఉండాలి

భారత పౌరులై ఉండాలి.

**21 ఏళ్లు వయసు నిండి ఉండాలి.**

అభ్యర్థి నగర/ మున్సిపాల్టీల్లో కాంట్రాక్టర్‌గా, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో ఆదాయం వచ్చే పదవుల్లో ఉండరాదు.

పురపాలక కౌన్సిలర్‌గా పోటీలో బరిలోకి దిగితే పురపాలిక పరిధిలో ఓటరుగా నమోదై ఉండాలి.

కార్పొరేటర్‌గా పోటీ చేస్తున్నట్లయితే నగరపాలిక పరిధిలో ఓటరుగా నమోదై ఉండాలి

గత ఎన్నికల్లో ఎన్నికల సంఘం అనర్హులుగా ప్రకటించినవారు, ఐపీ పెట్టినవారు ఎన్నికలో పోటీ చేసేందుకు అనర్హులు .

కీలకంగా బీ-ఫాం : ఆయా పార్టీల తరఫున ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ఆయా రాజకీయ పక్షాల నుంచి బీ-ఫాంను కలిగి ఉండాలి. నామినేషన్ల ఉపసంహరణ తేదీ రోజున ఎన్నికల రిటర్నింగ్ అధికారి(ఆర్వో)కి దానిని సమర్పించాల్సి ఉంటుంది. అలా చేయని వారిని ఇండిపెండెంట్ అభ్యర్థులుగా పరిగణిస్తారు. అభ్యర్థులను స్థానిక వార్డు/ డివిజన్‌లోని ఒక ఓటరు మద్ధతు అవసరం ఉంటుంది. ఇండిపెండెంట్ అభ్యర్థిని స్థానికంగా 10 మంది ఓటర్లు ప్రతిపాదించాల్సి ఉంటుంది.

**నామినేషన్‌కు కావాల్సిన పత్రాలు ఇవే :**

ఎన్నికల సంబంధిత అధికారి నుంచి పొందిన నామినేషన్ అప్లికేషన్, ఆస్తులు, ఆదాయాలు, అప్పులు, కేసుల సమగ్ర వివరాలతో కూడిన అఫిడవిట్, ఆధార్ కార్డు, అభ్యర్థి ఓటరు, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు ఇవ్వాల్సి ఉంటుంది.

ఒక అభ్యర్థి 4 సెట్ల కంటే ఎక్కువ నామినేషన్లు వేయరాదు. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రిజర్వ్ చేసిన స్థానాల్లో ఆ పోటీ చేసే ఆయా సామాజికవర్గాల వారు కచ్చితంగా క్యాస్ట్ సర్టిఫికెట్ సమర్పించాలి.

అభ్యర్థులు నామినేషన్‌కు ఒక రోజు ముందు బ్యాంకు అకౌంట్ ఓపెన్ చేసి ఎన్నికల ఖర్చులను దానిద్వారా మాత్రమే నిర్వహించాలి.

**వీటిపై దృష్టి సారించకపోతే ఇక అంతే! :**

అఫిడవిట్‌లో ఏ కాలమ్‌ను ఖాళీగా ఉంచకూడదు. ఒకవేళ వారికి వర్తించని సమాచారం ఏదైన ఉంటే అక్కడ లేదు అని స్పష్టంగా రాయాలి.

అభ్యర్థిని నామినేట్ చేసే ఓటర్లు తప్పనిసరిగా అదే వార్డుకు చెందిన వారై ఉండాలి

ఆస్తులు, అప్పులు, క్రిమినల్ కేసులు, విద్యార్హతల వివరాలు నిజమైనవి మాత్రమే ఉండాలి.

కుల ధ్రువపత్రంలో ఎలాంటి తప్పులు ఉండకూడదు.

చెల్లించిన డిపాజిట్‌కు సంబంధించిన అసలు రసీదును నామినేషన్ ఫారమ్‌కు జతచేయాలి.

పురపాలిక/నగరపాలిక నుంచి పొందిన 'నో డ్యూస్' ధృవీకరణ పత్రాన్ని సమర్పించాలి.

**బీ- ఫారమ్ ఎవరికి దక్కుతుందో? :** నామినేషన్ల ప్రక్రియ అధికారికంగా ప్రారంభం కాకముందే మున్సిపల్ ఎన్నికల టికెట్ల కేటాయింపు విషయంలో ప్రధాన పార్టీల ముఖ్యనేతలు వివాదాలను ఎదుర్కొంటున్నారు. మరో పక్క బీ-ఫారమ్ నాకు దక్కుతుందా లేక చివరి నిమిషంలో పార్టీ వేరే వారికి ఇస్తుందా అని మల్లగుల్లాలు పడుతున్నారు. రాష్ట్రంలోని పలు కార్పొరేషన్లు, మున్సిపాలిటీలలో మొత్తం 2,996 డివిజన్లు, వార్డులకు ఎన్నికలు జరగనున్నాయి. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ, ఎంఐఎం, వామపక్షాలు ఇతర పార్టీలనూ నాయకులు పోటీ చేయడానికి తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు.

# ఈ రూట్‌లో రద్దీ కాస్త ఎక్కువగా ఉంది

**సోషల్ మీడియా ద్వారా ట్రాఫిక్ అప్‌డేట్స్**

**ప్రజలకు ట్రాఫిక్ సమాచారం తెలియజేసేందుకు పోలీసుల వినూత్న ఐడియా**

**సోషల్ మీడియా ద్వారా ట్రాఫిక్ అప్‌డేట్స్**

**ముందస్తుగానే వాహనాల రద్దీ గురించి తెలుసుకునేందుకు అవకాశం**



హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్ సమస్యతో వాహనదారులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. కొన్నిసార్లు కిలోమీటర్ ప్రయాణానికి గంటల సమయం ట్రాఫిక్ సిగ్నళ్ల వద్ద వేచి ఉండాల్సి వస్తోంది. ముందుకు కదల్లేక ట్రాఫిక్‌లో చిక్కుకుని తిరిగి వెనక్కి వెళ్లలేక నానా తిప్పలు పడుతున్నారు. అయితే ఈ సమస్యకు నగరంలోని ట్రాఫిక్ పోలీసులు ముందస్తు సమాచారంతో చక్కని పరిష్కారాన్ని చూపెడుతున్నారు. ఏయే ప్రాంతాల్లో రద్దీ ఎక్కువగా ఉందో రోడ్ల వారీగా ముందే రేఖాచిత్రాలతో పౌరులకు అందుబాటులో ఉంచుతున్నారు. సైబరాబాద్ పోలీసులు నేరుగా వాహనదారులకు ట్రాఫిక్‌పై ఎప్పటికప్పుడు సమాచారాన్ని ఇస్తున్నారు. మరి ఈ సేవలు ఎలా ఉపయోగించుకోవాలి? అనే విషయాన్ని ఇప్పుడు తెలుసుకుందాం.హైదరాబాద్ పోలీసులు అందుబాటులోకి వచ్చిన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటున్నారు. సామాజిక మాధ్యమాల వేదికగా ట్రాఫిక్‌నకు సంబంధించిన సమాచారాన్ని నగరవాసులకు చేరవేస్తున్నారు. ఏయే మార్గాల్లో ట్రాఫిక్ ఎక్కువగా ఉంది? అనే విషయాలను ఎప్పటికప్పుడు ఫేస్‌బుక్, ఎక్స్‌ల ద్వారా ఎప్పటికప్పుడు అప్‌డేట్‌లు ఇస్తున్నారు. రేఖాచిత్రాలు, ఫొటోల ద్వారా పరిస్థితిని వివరిస్తూ పోస్టులు చేస్తున్నారు. ప్రత్యామ్నాయ మార్గాలను సూచిస్తున్నారు. ముదురు ఎరుపు రంగులో ఉంటే విపరీతంగా రద్దీ ఉన్నట్లు, ఎరుపులో ఉంటే నెమ్మదిగా కదులుతున్నట్లు, పసుపురంగులో ఉంటే కొంత వేగంతో వెళ్తున్నట్లుగా గుర్తించాలి. గూగుల్ సంస్థ సహకారంతో పోలీసులు ఈ అప్‌డేట్లను అత్యంత కచ్చితత్వంతో ఇస్తున్నారు. హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసుల ఎక్స్ అకౌంట్‌ను ఏకంగా 2.89 లక్షల మంది ఫాలో అవుతున్నారు. త్వరలో నేరుగా పౌరులకు సమాచారాన్ని ముందే పంపించే విధానాన్ని అధికారులు అందుబాటులోకి తెస్తున్నారు.ట్రాఫిక్ జామ్ ప్రత్యామ్నాయ మార్గాలకు సంబంధించి సైబరాబాద్ పోలీసులు 'ట్రాఫిక్ పల్స్' అందుబాటులోకి తెచ్చారు. సైబరాబాద్ కమిషనరేట్ వెబ్‌సైట్‌లో పేరు, ఫోన్ నంబరు నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. ఆ తర్వాత ఎస్ఎంఎస్, వాట్సప్ అప్‌డేట్లు వస్తాయి. విపరీతమైన రద్దీ ఉండే ఐటీ కారిడార్‌ను ఉద్దేశించి దీన్ని అందుబాటులోకి తీసుకురావడం సత్ఫలితాల్నిస్తోంది.ట్రాఫిక్ వల్ల ఇన్ని సమస్యలా : ప్రస్తుత కాలంలో ప్రజలకు ట్రాఫిక్ రద్దీ ప్రధాన సమస్యగా మారింది. పాఠశాల లేదా కళాశాలకు, ఆఫీస్‌నకు వెళ్లాలన్నా గంటల కొద్దీ ట్రాఫిక్ చక్రబంధంలో చిక్కుకోవాల్సిన పరిస్థితి తలెత్తుతోంది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ట్రాఫిక్ రద్దీ కారణంగా ప్రయాణించే ప్రతి ఒక్కరికీ ప్రతి ఏటా సుమారు 130 గంటల సమయం వృథా అవుతోందని ఓ సంస్థ విడుదల చేసిన నివేదికలో తేలింది. అలాగే ట్రాఫిక్ రద్దీ కారణంగా దేశానికి సుమారు 1.47 లక్షల నష్టం వాటిల్లుతుందని ఓ సంస్థ పేర్కొంది. ట్రాఫిక్ సమస్య వల్ల ఎంతో నష్టం జరుగుతుందో ఈ వివరాలను పరిశీలిస్తేనే అర్థం అవుతోంది.ఇక ట్రాఫిక్ కష్టాల నుంచి ఉపశమనం : భవిష్యత్ ట్రాఫిక్ రద్దీని దృష్టిలో ఉంచుకుని హైదరాబాద్ మహానగరంలో చేపట్టిన హెచ్-సిటీ ప్రాజెక్టు పనులు ఊపందుకున్నాయి. ఈ ప్రాజెక్టులో భాగంగా రూ.7 వేల కోట్లతో చేపట్టిన పనులను గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఒక్కొక్కటిగా పట్టాలెక్కిస్తోంది. నగరంలో కీలకమైన రహదారుల విస్తరణతోపాటు అవసరమైన చోట స్టీల్ బ్రిడ్జిలు, అండర్ పాస్‌లు నిర్మాణానికి సంబంధించి జీహెచ్ఎంసీ ఇప్పటికే ప్రణాళికలను సిద్ధం చేసింది. ఈ ప్రాజెక్టు ముగిసి వచ్చే ఏడాది ప్రారంభానికి వాటిని నగర ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని భావిస్తోంది. అలాగే గత ప్రభుత్వం హయాంలో చేపట్టిన ఎస్సార్డీపీ పనులు త్వరలోనే పూర్తి చేస్తామని జీహెచ్ఎంసీ వివరించింది.ప్రస్తుత అవసరాలకు తగిన విధంగా, భవిష్యత్ అవసరాలను అంచనా వేస్తూ ప్రాజెక్టు ప్రణాళికల్లో మార్పులు, అంచనా వ్యయాల్లో సర్దుబాటు, భూసేకరణ ప్రతిపాదనలను తయారు చేయడం, ఇతరాత్ర ప్రక్రియలన్నీ పూర్తి చేసుకొని ఒక్కోక్కటిగా ప్రాజెక్టు పట్టాలెక్కుతోంది. వారానికోసారి బల్దియా కమిషనర్ హెచ్ సిటీ ప్రాజెక్టులపై సమీక్ష చేస్తుండటంతో ఆయా పనుల్లో మరింత వేగం పెరిగింది.

# ఏపీపై రుణభారం రూ.4.33 లక్షల కోట్లు

**2064 వరకు కట్టాల్సిందేనని ఆర్‌బీఐ నివేదిక**


**వచ్చే ఐదేళ్లలో రుణాలు తీర్చాలంటే**

**రూ.93,982 కోట్లు అవసరం**

**ఏటా సుమారు రూ.20 వేల కోట్ల భారం**

**బడ్జెట్‌లో సింహభాగం అప్పులు, వడ్డీలు,**

**ఉద్యోగుల జీతభత్యాలు, పింఛన్లకే**




రిజర్వ్ బ్యాంక్ వివిధ రాష్ట్రాల ఆర్థిక పరిస్థితులపై తాజాగా వెలువరించిన నివేదిక ఈ అంశాన్ని విశ్లేషించింది. దశాబ్దాలుగా వివిధ ప్రభుత్వాలు రిజర్వ్ బ్యాంక్ నుంచి ఉమ్మడి, విభజిత ఆంధ్రప్రదేశ్‌లో సెక్యూరిటీల వేలంలో తీసుకున్న రుణాలు తీరాలంటే 2064వ సంవత్సరం రావాల్సిందే అంటున్నారు సంబంధిత నిపుణులు. అంటే, ఈ అప్పు తీరేందుకు మరో 38 ఏళ్లు పడుతుందన్నమాట. కేంద్ర ప్రభుత్వం ఏటా ప్రతి రాష్ట్రానికి రుణాలు తీసుకునేందుకు అనుమతులిస్తుంది. ఆ ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర స్థూల ఉత్పత్తి విలువను లెక్కించి, అందులో 3% వరకు రాష్ట్ర ప్రభుత్వాలు రుణాలు తీసుకునేందుకు కేంద్ర ఆర్థికశాఖ అనుమతి ఇస్తూ ఉంటుంది. ఈ అనుమతులు రెండు విడతలుగా అంటే ముందు అర్ధ సంవత్సరానికి, తర్వాత రెండు త్రైమాసికాలకు వేర్వేరుగా లభిస్తాయి. ఇందుకు అనుగుణంగా ఆర్‌బీఐ సెక్యూరిటీల వేలం వేసి, ఆయా ప్రభుత్వాలకు రుణాలు సమకూరుస్తుంది. రాష్ట్ర విభజనకు ముందు నుంచీ వివిధ ప్రభుత్వాలు సెక్యూరిటీల వేలం రూపంలో చేసిన అప్పులు, విభజన సమయంలో ఏపీకీ వాటాగా సంక్రమించాయి. ఆ తర్వాతి ప్రభుత్వాలు కూడా ఏటా రుణాలు తీసుకుంటూనే, మరోవైపు పాత అప్పులకు అసలు, వడ్డీ కలిపి చెల్లిస్తున్నాయి. ఇలా ఒక్క సెక్యూరిటీల రూపంలోనే ఏపీపై 2025 మార్చి 31 వరకు ఉన్న భారం రూ.4,33,443 కోట్లుగా ఆర్‌బీఐ లెక్క తేల్చింది. ఈ అప్పు తీరాలంటే 2064 వరకు ఏటా కొంతమొత్తం చొప్పున చెల్లించాల్సి ఉంటుందని నివేదికలో పేర్కొంది.ఈ ఐదేళ్లలోనే రూ.93,982 కోట్లు కట్టాలి!: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం సహా వచ్చే ఐదేళ్లలో రాష్ట్ర అభివృద్ధి రుణాలు తీర్చాలంటే రూ.93,982 కోట్లు అవసరం. ఈ ఒక్క అప్పు తీర్చాలంటేనే రాష్ట్ర బడ్జెట్‌పై ఏటా సుమారు రూ.20 వేల కోట్ల భారం పడుతుంది. ఈ ఏడాది బడ్జెట్‌లో ఇందుకు రూ.20,050 కోట్లు కేటాయించారు. వచ్చే ఏడాది రూ.18,109 కోట్లు చెల్లించాల్సి ఉంటుంది. 2028-29, 2029-30 ఆర్థిక సంవత్సరాల్లోనూ ఏటా రూ.20 వేల కోట్లకు మించి కేటాయించాల్సి ఉంటుంది. మొత్తం అప్పులో ఏడాది లోపు తీర్చగలిగేది 4.6%, ఐదేళ్ల లోపు కట్టగలిగేది 17.1%, 5-10 ఏళ్ల గడువులో చెల్లించేది 27%. 10-20 ఏళ్ల వ్యవధిలో తీర్చాల్సిన అప్పు 47.8 శాతంగా ఉన్నట్లు ఆర్‌బీఐ విశ్లేషించింది.ఇది కేవలం సెక్యూరిటీల వేలం ద్వారా సేకరించిన అప్పులకు సంబంధించింది మాత్రమే. ప్రావిడెంట్ ఫండ్, నాబార్డ్, ఇతర బాండ్లు, విద్యుత్ సంస్థల బకాయిలు, కార్పొరేషన్ల రుణాలు వంటివి కూడా భారంగా పరిణమిస్తున్నాయి. బడ్జెట్‌లో సింహభాగం సెక్యూరిటీ వేలం ద్వారా తీసుకున్న అప్పులు, వాటికి వడ్డీలు, ఉద్యోగుల జీతభత్యాలు, పింఛన్లకే సరిపోతుంది. వీటికితోడు గత ప్రభుత్వం ఉద్యోగులకు చెల్లించాల్సిన జీతభత్యాలు, ఆర్థిక ప్రయోజనాలు సహా గుత్తేదార్ల బిల్లులు భారీగా బకాయిలు పెట్టింది.రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుత లెక్కల ప్రకారం 2040 నుంచి 2064 మధ్య దాదాపు రూ.లక్ష కోట్ల సెక్యూరిటీ రుణాల భారం మోయాల్సి ఉంటుంది. ఆ 24 ఏళ్లలో రూ.99,293 కోట్లు చెల్లించాల్సి ఉంటుందని ఆర్‌బీఐ లెక్క తేల్చింది. ప్రస్తుతం ఈ భారం.. మొత్తం అప్పులో 4.5%గా ఉంది. 2030 వరకూ దాదాపు ఇదే లెక్కన అప్పులు కడుతూ పోవాల్సిందే. ఆ తర్వాత అది ఏటా 5.5 శాతానికి పెరగవచ్చని అంచనా.

## ప్రభుత్వ ఖర్చులతో స్వదేశానికి చేరిన గల్ఫ్ కార్మికుని మృతదేహం

**సీఎం ప్రజావాణి చొరవతో కుటుంబానికి రూ.1.50 లక్షల సాయం**



**హైదరాబాద్, జనవరి 29 ప్రజా మంటలు :** ఓమాన్‌లో మృతి చెందిన నిజామాబాద్ జిల్లా నవీపేట మండలం యాంచా గ్రామానికి చెందిన గల్ఫ్ కార్మికుడు గొల్ల అబ్బులు మృతదేహం తెలంగాణ ప్రభుత్వ ఖర్చులతో హైదరాబాద్‌కు చేరింది. డిసెంబర్ 9న 'ఇబ్రి' ఎడారిలో మృతి చెందిన ఆయన మృతదేహం 52 రోజుల అనంతరం స్వదేశానికి వచ్చింది.కుటుంబం సీఎం ప్రవాసీ ప్రజావాణిని ఆశ్రయించడంతో, సీఎం సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా మృతుడి భార్య చిన్న సావిత్రికి రూ.1.50 లక్షల ఆర్థిక సాయం అందించారు. అలాగే జీఏడీ ఎన్నారై విభాగం ఉచిత అంబులెన్స్ సౌకర్యం కల్పించింది. సీఎం ప్రజావాణి అండకు బాధిత కుటుంబం ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి, సంబంధిత అధికారులకు ధన్యవాదాలు తెలిపింది.

## సమ్మక్క సారలమ్మ జాతరకు పటిష్ట పోలీస్ బందోబస్తు



**ఎల్కతుర్తి జనవరి 29 ప్రజా మంటలు :** ఎల్కతుర్తి మండలంలోని దామెర గ్రామంలో భీమదేవరపల్లి మండలం ముల్కనూర్ గ్రామంలో జరుగుతున్న సమ్మక్క సారలమ్మ జాతరకు పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. రెండు సంవత్సరాలకు ఒక్కసారి జరిగే ఈ మహా జాతరకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తున్న నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టారు. ఎల్కతుర్తి సర్కిల్ ఇన్స్పెక్టర్ పులి రమేష్ ఆదేశాల మేరకు భీమదేవరపల్లి ఎస్సై రాజు, వంగర ఎస్సై దివ్య, వేలేరు ఎస్ఐ సురేష్ నాయక్, ఎల్కతుర్తి ఎస్సై అక్కినపల్లి ప్రవీణ్ కుమార్ పోలీస్ బందోబస్తు కట్టుదిట్టంగా నిర్వహిస్తున్నారు. జాతర జరుగుతున్న 28, 29, 30, భద్రత చర్యలను మరింత కఠినంగా అమలు చేస్తామని పోలీసులు తెలిపారు. జాతర సందర్భంగా భక్తులు ప్రజలు అన్ని రాజకీయ పార్టీల ప్రజా ప్రతినిధులు పోలీసులకు సహకరించాలని సిఐ పులి రమేష్ కోరారు. సమ్మక్క సారలమ్మ గద్దెల మీదకు వచ్చేంతవరకు ప్రతి ఒక్కరు శాంతిభద్రతలు పాటిస్తూ పోలీసుల సూచనలను అనుసరించాలని ఆయన సూచించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ట్రాఫిక్ నియంత్రణ భద్రత ఏర్పాటు చేపట్టినట్లు తెలిపారు.

## ఎన్నికల లబ్దికోసమే ఫోన్ ట్యాపింగ్ కేసులో కేసీఆర్‌కు సిట్ నోటీసులు : కవిత



**హైదరాబాద్, జనవరి 29 ప్రజా మంటలు :** ఫోన్ ట్యాపింగ్ కేసులో మాజీ సీఎం కేసీఆర్‌కు సిట్ నోటీసులు జారీ చేయడంపై తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత స్పందించారు. ఎన్నికలు ఉన్నందునే కేసీఆర్ గారికి నోటీసులు ఇచ్చారని ఆమె వ్యాఖ్యానించారు. ఫోన్ ట్యాపింగ్ వంటి అత్యంత బాధాకరమైన అంశంపై ప్రభుత్వం నిజంగా సీరియస్‌గా లేదని అన్నారు. ఈ కేసులో విచారణను పూర్తిచేసి స్పష్టమైన నిర్ణయానికి రావాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. కానీ ప్రభుత్వ ఉద్దేశం ఏంటో ఎవరికీ అర్థం కాని పరిస్థితి నెలకొందని విమర్శించారు.ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం చాలా తీవ్రమైన అంశమని, అయితే దానికి బాధ్యులైన నేరస్తులు నిజంగా శిక్ష అనుభవిస్తారా లేదా అన్నది వేచి చూడాల్సి ఉందని కల్వకుంట్ల కవిత అన్నారు.

## రోడ్డు భద్రతపై ప్రజల్లో చైతన్యం తీసుకురావడంలో మీడియా పాత్ర కీలకం

**హుజురాబాద్ వాహనముల తనిఖీ అధికారి కంచి వేణు**



**హుజురాబాద్, జనవరి 29 (ప్రజా మంటలు (ప్రతినిధి కాశిరెడ్డి ఆదిరెడ్డి) :** రోడ్డు ప్రమాదాలు తగ్గించడంలో ప్రతి ఒక్కరి బాధ్యత ఎంతో కీలకమని మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ కంచి వేణు అన్నారు. రోడ్డు భద్రత మాసోత్సవం సందర్భంగా హుజురాబాద్ రవాణా కార్యాలయంలో మీడియా ప్రతినిధులు, ప్రజలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, హెల్మెట్ వినియోగం, సీట్‌బెల్ట్ ధరించడం తప్పనిసరిగా పాటించాలని సూచించారు. మద్యం సేవించి వాహనం నడపడం, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం వంటి చర్యలు ప్రమాదాలకు దారితీస్తాయని హెచ్చరించారు. ట్రాఫిక్ నిబంధనలను కచ్చితంగా పాటిస్తే అనేక ప్రమాదాలను నివారించవచ్చని తెలిపారు. అలాగే మైనర్లకు వాహనాలు అప్పగించరాదని, తల్లిదండ్రులు ఈ విషయంలో మరింత బాధ్యత వహించాలని ఆయన సూచించారు. రోడ్డు భద్రతపై ప్రజల్లో అవగాహన కల్పించడంలో మీడియా పాత్ర ఎంతో కీలకమని, ఈ విషయంలో మీడియా సహకారం నిరంతరం అవసరమని కంచి వేణు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు సీనియర్ రిపోర్టర్లు, మీడియా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## బస్టాండుకు వెళ్లకుండా నడిరోడ్డు మీద దింపి వెళ్ళిపోతున్న కరీంనగర్ టు డిపో ఆర్టీసీ బస్సు




**ఎల్కతుర్తి జనవరి 29 ప్రజా మంటలు :** ఎల్కతుర్తి మండల కేంద్రంలోని బస్టాండుకు వెళ్లకుండా నడిరోడ్డు మీద దింపి వెళుతున్న కరీంనగర్ టు డిపో ఆర్టీసీ బస్సు హుజురాబాద్ డిపో సూపర్ లగ్జరీ బస్సులు బస్టాండ్లకు వెళ్లకుండా రోడ్డుపై ఆపి సుమారు సమయం సాయంత్రం 8 12 నిమిషాలకు జరిగిన సంఘటన బస్టాండ్లో 18 మంది మహిళలు 26 మంది యువకులు ఉన్నారు అలా బస్సులు ఎందుకు వెళ్లిపోతున్నాయని వాపోయారు ప్రయాణికులకు తీవ్ర ఇబ్బంది గురవుతున్నారు మేడారం జాతర సందర్భంగా హనుమకొండ నుండి కరీంనగర్ కు వెళ్లే బస్సులు ఎల్కతుర్తి బస్టాండ్ లోపలికి రాకుండా నడిరోడ్డు మీద ప్రయాణికులను దింపి వెళ్తున్నారు తెలంగాణ రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ నియోజకవర్గంలో అన్ని డిపో బస్సులు బస్టాండ్ లోపలికి వెళ్లే విధంగా మంత్రి ఆదేశాల మేరకు ఈ అంశాన్ని అన్ని విధాల తగు చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరారు.

PRINTED AND PUBLISHED BY V.NARSINGAM, ON BEHALF OF CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI S HARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE. EDITOR : CH V. PRABHAKAR RAO, RNI . TELTEL/2021/81092 : PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com